సాక్షి ప్రకాశం

శుక్రవారం । 25 ఏప్రిల్ । 2025



బెల్టు షాపులకు పితామహుడు చంద్రబాబు

రాష్ట్రంలో బెల్టు షాపులకు సీఎం చంద్రబాబునాయుడే పితామహుడని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు విమర్శించారు. - 8లో..



పేదింటి సరస్వతి రత్నాలు

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాలోని పేద కుటుంబాలకు చెందిన పలువురు విద్యార్థులు మంచి మార్కులు సాధించి శభాష్ అనిపించుకున్నారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
37.5 /29

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. గాలిలో తేమ శాతం అధికంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

న్యూస్‌రీల్

ఎయిర్‌పోర్టుకు 1,080 ఎకరాల భూ సేకరణ


- జేసీ గోపాలకృష్ణ



ఎయిర్‌పోర్ట్ కోసం భూములను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

కొత్తపట్నం: మండలంలోని అల్లూరు–ఆలూరు మధ్యలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం 1,080 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఏడీ సర్వేయర్ బాషా, కొత్తపట్నం తహసీల్దార్ మధుసూదన్‌రావు, మండల సర్వేయర్ సుధీర్‌బాబు, ఆర్ఐ వరప్రసాద్, వీఆర్వో బాలస్వామితో కలిసి గురువారం క్షేత్రస్థాయిలో భూములను జేసీ పరిశీలించారు. కొప్పోలు దగ్గర్లోని నక్కలవారిపాలెం ఉత్తరం రోడ్డును పరిశీలించారు. అల్లూరు–ఆలూరు రోడ్డు, ఆలూరు పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కొప్పోలు రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 454, 457, 453లో 9 ఎకరాలతో పాటు అల్లూరు రెవెన్యూ పరిధిలో 2280, 2281, 2282, 2283 సర్వే నంబర్లు, ఆలూరు రెవెన్యూ పరిధిలోని 506, 507, 508, 513 సర్వే నంబర్లలో కలుపుకుని మొత్తం 1,080 ఎకరాల భూ సేకరణ జరగాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ఎయిర్‌పోర్ట్‌కు 744 ఎకరాలు సరిపోతుందని, భవిష్యత్‌లో వివిధ రకాల అవసరాల నిమిత్తం 336 ఎకరాలు అదనంగా సేకరించాల్సి ఉందని జేసీ అన్నారు. భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఫైలుకో రేటు.. బయోమెట్రిక్కు



జిల్లాలో వైద్యారోగ్యశాఖకు అవినీతి జబ్బు చేసింది. జిల్లా కార్యాలయంలో పైసలు ఇవ్వందే ఒక్క ఫైలు కూడా కదలడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇటీవల జరిగిన నర్సింగ్ స్టాఫ్ పదోన్నతుల్లో భారీ ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయని, ఫోన్ పే ద్వారా వసూళ్లు చేశారన్న ఆరోపణలు పెద్ద ఎత్తున వచ్చాయి. ఇదే విషయంపై జిల్లా అధికారులకు సైతం ఫిర్యాదులు అందాయి. చాలా మంది డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్స్ వరకూ ప్రభుత్వ వైద్యశాలల్లో కంటే ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దాలని కోరుతున్నారు.

ఫోన్ పే ద్వారా వసూళ్లు...

ఇక, ఇటీవల జిల్లాలోని 212 మంది నర్సింగ్ స్టాఫ్‌కు గ్రూప్–3 పదోన్నతులు కల్పించారు. కౌన్సిలింగ్ జరుగుతున్న సమయంలో కూడా కొంత మంది నుంచి ఫోన్ పే కొట్టించుకోవడం బయటపడటంతో.. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం ఎంత అవినీతిమయంగా మారిపోయిందో అర్థం చేసుకోవచ్చని పలువురు విమర్శిస్తున్నారు. దీనిపై కలెక్టర్ కార్యాలయానికి ఫిర్యాదు అందింది. పదోన్నతులకు సంబంధించి 8 మంది సీనియార్టీలలో కూడా తమకు ఇష్టమొచ్చినట్లు మార్పులు చేసినట్లు ఆరోపణలున్నాయి. అలాగే, నచ్చిన చోట పోస్టింగులు ఇవ్వడానికి పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. దీనికి సంబంధించిన ఫోన్ పే స్క్రీన్ షార్ట్‌లతో సహా అనేక సాక్ష్యాలను అధికారులకు అందించినట్లు సమాచారం. ఈ విషయంలో సాక్ష్యాలతో సహా మాలమహానాడు అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య ఫిర్యాదు చేయడంతో తేనె తుట్టి కదిలింది. జిల్లా వైద్యారోగ్య శాఖలో అవినీతిపై ఆగ్రహం వ్యక్తం చేసిన జేసీ గోపాలకృష్ణ విచారణకు ఆదేశించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఎస్‌డీసీ మాధురిని విచారణ అధికారిగా నియమించగా, ఈ విచారణ కూడా వాయిదా పడుతూ వస్తోంది.

- డీఎంఅండ్ హెచ్‌ఓ కార్యాలయంలో అక్రమాలు
- ఫైలు కదలాలంటే పైసలు ఇవ్వాల్సిందే
- బయోమెట్రిక్ హాజరులో గోల్‌మాల్
- ఇలా వచ్చి అలా వెళ్లిపోతున్న వైనం
- వైద్యసిబ్బందికి నోటీసులు
- ఫోన్ పే వసూళ్లపై వాయిదాలు పడుతున్న విచారణ

ఒంగోలు టౌన్:

యథారాజా.. తథా ప్రజా అన్న చందంగా తయారైంది జిల్లాలోని వైద్యారోగ్యశాఖ పరిస్థితి. జిల్లా కార్యాలయంలో పైసా వసూళ్లను గమనించిన ప్రాథమిక వైద్యశాలలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్యులు, నర్సింగ్ స్టాఫ్, ల్యాబ్ టెక్నీషియన్లు ప్రైవేటు వైద్యశాలలు, కార్పొరేట్ వైద్యశాలల్లో పనిచేస్తూ ఉద్యోగాన్ని ప్రవృత్తిగా చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇలా వచ్చి అలా వెళ్లిపోతూ...

సమయానికి హాజరుకాకుండా విధులకు పంగనామాలు పెడుతున్నట్లు జిల్లాలోని చాలా పీహెచ్‌సీలకు చెందిన వైద్యులు, ఇతర సిబ్బందిపై ఆరోపణలు ఉన్నాయి. ఒంగోలులోని ఓ పట్టణ ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్యుడు, ల్యాబ్ టెక్నీషియన్ బయోమెట్రిక్ వేసి వెళ్లిపోతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొంత మంది మాత్రం ఉదయం వైద్యశాలకు వచ్చి ముఖ హాజరు వేసుకుని వెళ్లిపోయి తిరిగి తీరిగ్గా 10 గంటలకో, 11 గంటలకో విధులకు హాజరవుతున్నట్లు సమాచారం. నిబంధనల ప్రకారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు నిర్వర్తించాల్సి ఉండగా దాదాపు అన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సులు మధ్యాహ్నం ఒంటి గంటకే ఇంటికి వెళ్లిపోతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అత్యవసర సమయంలో ఎవరూ అందుబాటులో ఉండటం లేదన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయినా ఈ విషయంలో జిల్లా అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

నకిలీ ఓపీలు సృష్టిస్తున్నారా...

జిల్లాలోని పలు ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో నకిలీ ఓపీలు సృష్టిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో యూపీహెచ్‌సీల పరిధిలో 20 నుంచి 40 మంది ఆశా కార్యకర్తలు పనిచేస్తున్నట్లు సమాచారం. వారి నుంచి ఆయా ఆస్పత్రుల పరిధిలోని ఫోన్ నంబర్లను సేకరించి వారి పేర్ల మీద నకిలీ ఓపీలను సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది. అంతేగాకుండా ఆస్పత్రికి వచ్చిన వారి ఆధార్ నంబర్, ఫోన్ నంబర్లను సేకరిస్తున్న సిబ్బంది వారి పేర్ల నుంచి కూడా నకిలీ ఓపీలు సృష్టిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే నగరంలో చాలా మంది మొబైల్ ఫోన్లకు మెసేజ్‌లు వస్తున్నాయని చెబుతున్నారు. మీరు పలానా పీహెచ్‌సీలో వైద్య చికిత్స కోసం వచ్చినందుకు ధన్యవాదాలు. వైద్య సేవలో భాగంగా మీకు పలానా రక్త పరీక్షలు చేసినట్లు మెసేజ్‌లు వస్తుండటంతో జనాలు విస్తుపోతున్నారు. మేమెప్పుడు ఆస్పత్రికి వెళ్లాము, ఎప్పుడు రక్త పరీక్షలు చేయించుకున్నామంటూ ఆశ్చర్యపోతున్నారు.

బయోమెట్రిక్ ట్యాంపరింగ్...

జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన వైద్యులు ముఖ హాజరును ట్యాంపరింగ్ చేస్తున్నారన్న ఆరోపణలు సంచలనం సృష్టిస్తున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా వైద్యశాలల్లో పనిచేసే వైద్యులు, ఇతర సిబ్బందికి బయోమెట్రిక్‌తో పాటుగా ముఖ హాజరు (హెచ్‌ఆర్‌ఎస్)ను తప్పనిసరి చేసింది. తమ వద్ద ఉన్న మొబైల్ ఫోన్ ద్వారా ముఖ హాజరు వేయాలి. ఈ యాప్‌లో లొకేషన్ ఉంటుంది. తేదీ, టైం కూడా రికార్డవుతుంది. దాంతో కొంత మంది వైద్యులు, వైద్య సిబ్బంది దీని నుంచి తప్పించుకోవడానికి కొత్త తరహాలో ప్రయత్నాలు చేస్తుండటం గమనార్హం. తమ వద్ద ఉన్న ఫోన్లోనే లొకేషన్ కనిపించకుండా చేసి టైం అండ్ డేట్ మార్చేసి ముఖ హాజరు వేస్తున్నట్లు తెలుస్తోంది. అంతేగాకుండా విధులు నిర్వహించే ప్రాంతానికి వంద మీటర్ల దూరంలో ఉండి కూడా ముఖ హాజరు వేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. హాజరు ట్యాంపరింగ్‌కు సంబంధించి జిల్లాలో 14 మంది వైద్యులు, ఇతర సిబ్బందికి ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

ఫోన్ పే మీద విచారణ జరగాల్సి ఉంది :

నర్సింగ్ పదోన్నతులకు సంబంధించి ఫోన్ ద్వారా డబ్బులు ఎవరు వసూలు చేశారు, ఎవరికి ఇచ్చారనేది తెలియాల్సి ఉంది. ఈ విషయంలో ఇతర శాఖలకు చెందిన అధికారుల చేత విచారణ చేయాల్సిందిగా కోరాను. ఇంకా విచారణ జరగలేదు. విచారణ జరగాల్సి ఉంది. ఇక ఫోన్ ట్యాంపరింగ్ గురించి కమిషనర్ ఇచ్చిన నోటీసులు జారీ చేయడం జరిగింది. దానికి సంబంధించి వివరణ తీసుకుని డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు పంపించడం జరిగింది.

– డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, డీఎంఅండ్‌హెచ్‌ఓ

ఆ మూడు నిమిషాలు ఏం జరిగింది.?



హత్య జరిగిన గదిలో ప్రత్యక్ష సాక్షులను విచారిస్తున్న ఎస్పీ దామోదర్



హత్య జరిగిన తీరుపై వీరయ్య చౌదరి వ్యక్తిగత సిబ్బందిని ఆరా తీస్తున్న ఎస్పీ

- వీరయ్య చౌదరి కేసు విచారణకు రంగంలోకి ఎస్పీ దామోదర్
- మూడు గంటలపాటు ప్రత్యక్ష సాక్షులను విచారించి వివరాల సేకరణ
- భూ వివాదాలతో పాటు అన్ని కోణాల్లో ముమ్మర దర్యాప్తు
- 40 మందిని అదుపులోకి తీసుకుని విచారించినా పురోగతి లేదు
- హంతకులు ఉపయోగించిన వాహనాలు ఎక్కడివి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఇంతకూ ఆ రోజు ఏం జరిగింది. ఎంత మంది లోపలకు వచ్చారు. ఆ మూడు నిమిషాల్లో జరిగిన ఘటనకు సంబంధించిన విషయాలేమిటి. టీడీపీ నాయకుడు వీరయ్య చౌదరి హత్య జరిగిన తీరు, వివరాలను సేకరించేందుకు స్వయంగా ఎస్పీ ఏఆర్ దామోదర్ రంగంలోకి దిగారు. హత్య జరిగి దాదాపు 48 గంటలు దాటినా చిన్నపాటి క్లూ కూడా లభించకపోవడంతో పోలీసులు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. దీనికితోడు సీఎం చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో పోలీసులకు ఈ కేసు సవాల్‌గా మారింది. వీరయ్య చౌదరి హత్యకు బలమైన కారణాలుండి ఉండొచ్చన్న దిశగా దర్యాప్తు వేగవంతం చేశారు. ప్రధానంగా భూ వివాదాలతో పాటు మద్యం, ఆర్థిక వివాదాలను కూడా పరిగణలోకి తీసుకున్నట్లు సమాచారం. ఇప్పటి వరకూ 40 మందిని అదుపులోకి తీసుకుని విచారించినా కేసులో ఎలాంటి పురోగతి కనిపించలేదు. కేసును స్వయంగా పరిశీలించేందుకు ఎస్పీ ఏఆర్ దామోదర్ గురువారం సాయంత్రం ఘటన స్థలానికి వచ్చారు. దాదాపు మూడు గంటల పాటు విచారణ జరిపారు. హత్య జరిగిన సమయంలో కార్యాలయంలో వీరయ్య చౌదరి సహాయకుడితో పాటు ఆడిటర్, మహిళా సిబ్బంది ఉన్నట్లు సమాచారం. వారి నుంచి ఎస్పీ పూర్తి వివరాలడిగి తెలుసుకున్నారు. ముగ్గురు నిందితులు లోపలకు వచ్చారని, ఎవరు మీరు, ఎందుకొచ్చారని ప్రశ్నించగా కత్తి చూపి బెదిరించారని, దాంతో తాము భయంతో చూస్తుండిపోయామని చెప్పినట్లు తెలిసింది. నిందితులు లోపలకు వచ్చినప్పుడు కుర్చీలో ఉన్న వీరయ్య చౌదరి లేచి నిలబడిన వెంటనే ఆయనపై కత్తులతో విచక్షణారహితంగా దాడిచేసినట్లు వివరించారని తెలిసింది. వచ్చిన ముగ్గురిలో ఇద్దరు నిందితులు గొంతు నుంచి ఛాతి, పొత్తి కడుపు, వీపు భాగంలో కత్తులతో కసితీరా పొడవడంతో ఆయన రక్తపు మడుగులో పడిపోయినట్లు చెప్పారని సమాచారం. ఒక్కొక్కరితో విడివిడిగా ఎస్పీ మాట్లాడి వివరాలు సేకరించారు. కార్యాలయాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.

భూ వివాదాలే కారణమా..?

ఇప్పటి వరకు విచారణ జరుగుతున్న తీరును గమనిస్తే వీరయ్య చౌదరి హత్యకు భూ వివాదాలే ప్రధాన కారణం కావచ్చని భావిస్తున్నారు. వీరయ్య చౌదరికి జిల్లాతో పాటు నెల్లూరు జిల్లా రామాయపట్నం, హైదరాబాద్, వైజాగ్, బెంగళూరు ప్రాంతాల్లో భూ వివాదాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత ఆరు నెలలుగా హైదరాబాద్‌లో ఓ భూ వివాదం ఉన్నట్లు సమాచారం. ఈ వివాదంలో ప్రత్యర్థులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే వైజాగ్‌లోని భీమిలి, కోమలి, మధురానగర్ తదితర ప్రాంతాల్లోనూ భూ వివాదాలున్నట్లు సమాచారం. ఇక్కడ కూడా భూ వివాదానికి సంబంధించిన ఘర్షణ జరిగినట్లు చెబుతున్నారు. కర్ణాటకలోనూ రియల్ దందా చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా వివాదాస్పద భూములు కొనుగోలు చేయడం ఆయన ప్రాణాల మీదకు తెచ్చిందన్న ప్రచారం జరుగుతోంది.

వాహనాలు ఏమయ్యాయి..?

వీరయ్య చౌదరి హత్యకు ఉపయోగించిన స్కూటీ, మోటారు బైకు ఎక్కడి నుంచి వచ్చింది.. ఆ వాహనాలను సమకూర్చిందెవరు.. వాటిని ఎక్కడ వదిలిపెట్టి వెళ్లారన్న విషయాలపై జోరుగా చర్చ జరుగుతోంది. హత్య తర్వాత నిందితులు ఒంగోలు తాలూకా పోలీసుస్టేషన్ పక్కన వున్న సుజాత నగర్ నుంచి బైపాస్‌లోకి వెళ్లి అక్కడి నుంచి వెంకటేశ్వర కాలనీలోకి వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ దారిలో సీసీ కెమెరాలు పెద్దగా లేకపోవడం పోలీసుల విచారణకు అవరోధంగా మారింది. అయితే వెంకటేశ్వరకాలనీలో నుంచి ఎటువైపు వెళ్లారు.. తప్పించుకునేందుకు ఉపయోగించిన వాహనాలను ఎక్కడ విడిచిపెట్టారన్న సమాచారం ఇప్పటి వరకు పోలీసులు కనుగొనలేకపోవడం గమనార్హం. వీరయ్య చౌదరిని హత్య చేసిన తరువాత బయటకు వచ్చినప్పటి సీసీ ఫుటేజీలు మినహా పెద్దగా సాక్ష్యాలు లభించలేదు. విచారణ పరిధి జిల్లా దాటి రాష్ట్ర సరిహద్దులు దాటిపోవడంతో ఈ కేసు పోలీసులకు సవాల్ విసురుతోంది. సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబుతో పరిచయాలున్న నాయకుడి హత్య కావడంతో పాటు, సీఎం స్థాయిలో ఒత్తిడి వుండడంతో ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నారు.

40 మందిని అదుపులోకి తీసుకున్నప్పటికీ...

వీరయ్య చౌదరి హత్య జరిగిన రోజు రాత్రే పోలీసులు రంగంలోకి దిగారు. తొలుత ఆయన ఎంపీపీగా ప్రాతినిధ్యం వహించిన నాగులుప్పలపాడు గ్రామంలో కొంత మందిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం మీద రైస్ మాఫియా హస్తం ఏమైనా ఉందా.? అనే కోణంలో విచారణ చేశారు. ఈ క్రమంలోనే పొన్నూరు నుంచి ముగ్గురిని అదుపులోకి తీసుకుని ఒంగోలు తరలించారు. వారితో పాటు వీరయ్య చౌదరితో వివాదాలున్నట్లు భావిస్తున్న ప్రతిఒక్కరినీ పోలీసుస్టేషన్‌కు పిలిపించి విచారించినట్లు సమాచారం. మొత్తం మీద ఇప్పటి వరకు 40 మందిని విచారించగా ఎలాంటి క్లూ దొరకలేదని తెలుస్తోంది. ఈ క్రమంలోనే మరోసారి వీరయ్య చౌదరి హత్య జరిగిన స్థలాన్ని ఎస్పీ పరిశీలించారు. ప్రత్యక్ష సాక్షులతో మాట్లాడి మరిన్ని వివరాలడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు.

పొగాకు రైతుల కోసం పోరాడతాం

- మద్దతు ధర దక్కేంత వరకూ అండగా ఉంటాం
- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



పొగాకు వేలం కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న ఆదిమూలపు సురేష్, పక్కన చుండూరి రవిబాబు

కొండపి: పొగాకు రైతులకు మద్దతు ధర లభించేంత వరకూ వారికి అండగా ఉండి పోరాడతామని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ స్పష్టం చేశారు. గురువారం కొండపిలోని పొగాకు వేలం కేంద్రాన్ని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబుతో కలిసి ఆదిమూలపు సురేష్ సందర్శించి రైతులతో మాట్లాడారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పొగాకు రైతులను నిర్లక్ష్యం చేస్తోందని సురేష్ విమర్శించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పొగాకు రైతులు కనీవినీ ఎరుగని రీతిలో లాభాలు పొందారని గుర్తుచేశారు. జిల్లాలో పొగాకుతో పాటు కంది, మిరప, శనగ రైతులు ఆయా పంటలకు మద్దతు ధరలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు ప్రతిపక్షంగా తమ పోరాటాన్ని ఉధృతం చేసి రైతుల పక్షాన నిలబడతామని సురేష్ అన్నారు.

ఆనాటి గడ్డు పరిస్థితులను రైతులు ఎదుర్కొంటున్నారు : చుండూరి రవిబాబు

2015–16 కాలంలో టీడీపీ ప్రభుత్వంలో పొగాకు రైతులకు మద్దతు ధర లేక గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్నారని, ఈ సంవత్సరం కూడా అటువంటి గడ్డు పరిస్థితులను రైతులు ఎదుర్కొంటున్నారని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు అన్నారు. 2015–16లో పొగాకు రైతులకు మద్దతు ధర లేక నియోజకవర్గంలో ఐదుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని గుర్తుచేశారు. జిల్లా వ్యాప్తంగా ఆత్మహత్య చేసుకున్న రైతులతో పొగాకు కేంద్రాలను ముట్టడిస్తే రైతులపై కేసులు పెట్టిన ఘనత ఆనాటి, ఇప్పటి ప్రభుత్వానికే చెల్లిందన్నారు. రైతులు మూడు రకాలుగా నష్టపోతున్నారని తెలిపారు. దిగుబడి 30 శాతం తగ్గిందని, ధరలు 30 శాతం తగ్గాయని, 30 శాతం పెట్టుబడి పెరిగిందని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రవిబాబు వివరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు మద్దతు ధర అందించాలని డిమాండ్ చేశారు. పొగాకు రైతులు ధైర్యం కోల్పోవద్దని, వారి తరఫున ఉద్యమం చేయడానికి వైఎస్సార్ సీపీ ముందుంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను, ఏదో ఒక ఏజెన్సీని రంగంలోకి దించి పొగాకు కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర ఇచ్చేంత వరకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

గోడు వెళ్లబోసుకున్న రైతులు...

కొండపి వేలం కేంద్రాన్ని సందర్శించిన ఆదిమూలపు సురేష్, చుండూరి రవిబాబుతో పొగాకు రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. పెట్లూరుకు చెందిన గుజ్జుల నాగిరెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం ఇంతకన్నా తక్కువ నాణ్యత ఉన్న పొగాకును కేజీ 360 రూపాయలకు కొనుగోలు చేశారని తెలిపారు. దానికన్నా మెరుగైన పొగాకును ఈ సంవత్సరం కేవలం 250 రూపాయలకే కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. దీనివలన తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. ఇలాంటి ధరల వలన రైతులకు నష్టం వాటిల్లుతోందని, ఏం చేయాలో అర్థంకావడం లేదని, అయోమయమైన పరిస్థితిలో రైతాంగం ఉందని వైఎస్సార్ సీపీ నాయకులతో పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాకా పిచ్చిరెడ్డి, కొండపి మండల కన్వీనర్ ఆరికట్ల కోటిలింగయ్య, జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, పొగాకు ఉత్పత్తిదారుల కొండపి అధ్యక్షుడు నాగినేని భాస్కర్ చౌదరి, ఉపాధ్యక్షుడు బొక్కిసం సుబ్బారావు, స్టేట్ మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీ రియాజ్, రైతు విభాగం స్టేట్ జాయింట్ సెక్రటరీ రామచంద్రరావు, జిల్లా బీసీ సెల్ సెక్రటరీ మాచేపల్లి నాగయ్య, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు పుట్టా వెంకటరావు, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు నాగేశ్వరరావు, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు షేక్ వన్నూరు, ఇంటలెక్చువల్ అధ్యక్షుడు భువనగిరి సత్యనారాయణ, బీసీ సెల్ అధ్యక్షుడు వసంతరావు, కల్చరల్ వింగ్ అధ్యక్షుడు ఆళ్ల శ్రీనివాసరెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు గంగాధర్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు సుల్తాన్, కొండపి జెడ్పీటీసీ మారెడ్డి అరుణ వెంకటాద్రి, మర్రిపూడి జెడ్పీటీసీ సుధారాణి వెంకట్రావు, వైస్ ఎంపీపీ కోటరాజు, నియోజకవర్గ సీనియర్ నాయకులు రావూరి ప్రవీణ్, బచ్చల కోటేశ్వరరావు, వేముల రమేష్, మసనం వెంకట్రావు, బోధ రమణారెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, పిన్నిక శ్రీనివాసులు, చింతపల్లి హరి, మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమణారెడ్డి, హరినారాయణ, ఇతర నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

కార్మికుల పట్ల ఏపీసీపీడీసీఎల్ నిర్లక్ష్యం

ఒంగోలు సబర్బన్: కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏపీసీపీడీసీఎల్ తీరును ఎండగట్టాలని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్–1104 తీర్మానించింది. ఆ మేరకు గుణదలలో గురువారం నిర్వహించిన 1104 యూనియన్ కేంద్ర కార్యవర్గ సమావేశంలో నిర్ణయించింది. సమావేశంలోని అంశాలను ఏపీసీపీడీసీఎల్ డిస్కం 1104 యూనియన్ అధ్యక్షుడు రాచగర్ల సంజీవరావు ఒంగోలులో వెల్లడించారు. ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించి కార్మికుల్లో ఉన్న అశాంతిని పోగొట్టాలని మేనేజ్‌మెంట్‌ను డిమాండ్ చేసినట్లు చెప్పారు.

అపరిమిత మెడికల్ సదుపాయం కల్పించాలని, పెండింగ్లో ఉన్న మూడు డీఏలను తక్షణమే విడుదల చేయాలని, 01.04.2022 నుంచి కాంట్రాక్ట్ కార్మికులకు బకాయి ఉన్న పీఆర్సీ అరియర్స్ వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వంలో ఉన్న పాత పెన్షన్ విధానం ప్రకారం 31.08.2004లోపు జాయినైన ఉద్యోగులందరికీ ప్రభుత్వంలో ఉన్న పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సంబంధించిన మరికొన్ని ప్రధాన సమస్యలను మేనేజ్‌మెంట్ దృష్టికి పలు దఫాలు రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కృష్ణయ్య తీసుకెళ్లినా పెడచెవిన పెట్టారన్నారు. అవన్నీ పరిష్కరించాలని కోరారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

పేదింట సరస్వతి రత్నాలు

ప్రతిభ ఎవరి సొత్తు కాదు..సాధన చేస్తే విజయాలు ఒడిలో వాలిపోతాయి. అందుకు నిదర్శనం ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాలు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎందరో పేదింటి విద్యార్థులు..కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ఫలితాలు సాధించి ఔరా అనిపించారు. కనీస సౌకర్యాలు లేని ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కూలి పనులు చేస్తూ తమను చదివిస్తున్న తల్లిదండ్రుల రెక్కల కష్టానికి తగిన ఫలంగా రాష్ట్రస్థాయి మార్కులు సాధించారు.

– సాక్షి నెట్‌వర్క్

చిన్నప్పటి నుంచి చదువులో టాప్



తల్లిదండ్రులతో నిహారిక

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం రెడ్డిపాలెం గ్రామానికి చెందిన జోగులపర్తి వెంకట లక్ష్మి నిహారిక కామేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతూ 584 మార్కులు సాధించింది. చిన్నప్పటి నుంచి నిహారికకు చదవంటే ఎంతో ఇష్టం. తండ్రి సుబ్బారావు గ్రామంలో చిన్న రైస్ మిల్లు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. తల్లిదండ్రుల కష్టాన్ని అర్థం చేసుకున్న నిహారిక చదువులో ఎప్పుడూ ముందుండేది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా ఇచ్చే రూ.15 వేల అమ్మఒడి నిహారికకు ఎంతో ఉపయోగపడింది. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఐఎఫ్‌బీ ప్యానెళ్ల ద్వారా విద్యాభ్యాసం ఎంతో ఉపకరించిందంటుంది నిహారిక.

మెకానిక్ కొడుకు అందరినీ మెప్పించాడు..



షేక్.బషీర్

పెద్దదోర్నాల: పెద్దదోర్నాలకు చెందిన షేక్ ఖాజావలి, షైదాబీల కుమారుడు షేక్ బషీర్ పదో తరగతిలో 588 మార్కులు సాధించాడు. బషీర్ తండ్రి ఓ చిన్నపాటి మెకానిక్ షాపు నిర్వహిస్తుండగా,తల్లి షేక సైదాబీ కూలీ పనులకు వెళుతూ కుమారున్ని చదివిస్తున్నారు. నిరుపేద తల్లిదండ్రులు తనపై పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా బషీర్ పదో తరగతిలో మంచి మార్కులు సాధించి అందరీ చేత శభాష్ అనిపించుకున్నాడు. గతంలో అమ్మఒడి లాంటి పథకాలు తమకు తోడ్పాటు ఇచ్చాయని తల్లిదండ్రులు పేర్కొన్నారు.

ఆటో తోలి ముగ్గురు పిల్లలను చదివిస్తూ..



సుదర్శన్ చరణ్

పీసీపల్లి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్న గుంటసాని సుదర్శన్ చరణ్ పదో తరగతిలో 580 మార్కులు సాధించాడు. సుదర్శన్ తండ్రి ఆటో డ్రైవర్. తల్లిదండ్రుల కష్టం, వారి ప్రోత్సాహంతో సుదర్శన్ పదో తరగతిలో మంచి మార్కులు సాధించాడు. గత ప్రభుత్వంలో అమ్మఒడి వస్తే పుస్తకాలు, ఇతర ఖర్చులకు ఇబ్బంది ఉండేది కాదంటున్నారు. నాన్న ఆటో తోలుతూ, అమ్మ మిషన్ కుడుతూ మా ముగ్గురిని కష్టపడి చదివిస్తున్నారని సుదర్శన్ చరణ్ తెలిపాడు.

మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లి ..



నిహారికకు స్వీట్లు తినిపిస్తూ..

మర్రిపూడి: మండలంలోని శివరాయునిపేట దళితవాడకు చెందిన నిహారిక పదో తరగతిలో 586 మార్కులు సాధించింది. తండ్రి ఆంజనేయులు బేల్దారి మేస్త్రీ ..తల్లి కూలి పనిచేసుకుంటూ ముగ్గురు పిల్లలను పోషిస్తున్నారు. పనికి వెళితేనే కుటుంబం గడిచేది. తల్లిదండ్రుల కష్టాన్ని అర్థం చేసుకున్న నిహారిక కష్టపడి చదివింది. ఒక్కో రోజు బస్సు సమయానికి రాకపోతే కాలనీ నుంచి పాఠశాలకు మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లేది. గత ప్రభుత్వంలో అమ్మఒడి ఎంతో ఆసరాగా నిలిచిందని నిహారిక తల్లిదండ్రులు తెలిపారు.

వ్యవసాయంలో చేదోడువాదోడుగా ఉంటూనే..



మేనమామ , అత్తతో మహేంద్రరెడ్డి

కొనకనమిట్ల: పెదారికట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పల్లాల మహేంద్రరెడ్డి పదో తరగతిలో 584 మార్కులు సాధించాడు. చిన్నప్పటి నుంచి వాళ్ల అత్త ఇంట్లో ఉండి చదువుకుంటున్న మహేంద్రరెడ్డి వ్యవసాయంలోనూ వారికి చేదోడువాదోడుగా ఉండేవాడు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అమ్మఒడి పథకం ఎంతో ఉపయోగపడిందని, మంచి మార్కులు రావడం సంతోషంగా ఉందని తన ఆనందాన్ని వెల్లిబుచ్చాడు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..



తిరుమలరెడ్డి నర్మదా

పెద్దారవీడు: మండలంలో సానికవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న తిరుమలరెడ్డి నర్మలా 574 మార్కులు సాధించి మండల స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. నాన్న తిరుమలరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, అమ్మ సుబ్బలక్ష్మమ్మలు వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తల్లిదండ్రుల ప్రేరణ, ఉపాధ్యాయుల ప్రత్యేక శిక్షణ వల్ల ఇంత మంచి మార్కులు సాధించగలిగానని తెలిపింది. తల్లిదండ్రుల కష్టాన్ని అర్థం చేసుకున్న నిర్మద తొలి నుంచి చదువులో మేటీగా రాణిస్తుంది.

బెల్టుషాపులకు పితామహుడు చంద్రబాబు

- సారా వ్యతిరేక ఉద్యమాన్ని ఎన్టీఆర్ ప్రోత్సహిస్తే..
  చంద్రబాబు రాగానే చీప్ లిక్కర్, బెల్ట్‌షాపులను ప్రవేశపెట్టడం నిజం కాదా ?
- హామీలు నెరవేర్చలేక నెలకో కేసులతో డైవర్షన్ పాలిటిక్స్
- తప్పుడు కేసులతో కుట్రలు చేస్తున్న కూటమి పాలకులు
- జగనన్న పాలనలో మద్య నిషేధం దిశగా పరిపాలన
- కూటమి పాలనతో బలవంతంగా మద్యం తాగిస్తున్న వైనం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చుండూరి రవిబాబు

ఒంగోలు టౌన్: ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నెలకు ఒకరిపై తప్పుడు కేసులు బనాయిస్తూ డైవర్షన్ పాలిటిక్స్‌తో కాలయాపన చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు విమర్శించారు. చీప్ లిక్కర్, బెల్ట్ షాపులకు ఆద్యుడు చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చుట్టూ ఉన్న వ్యక్తులపై కేసులు పెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సారా వ్యతిరేక ఉద్యమం చేసిన ఎన్టీఆర్ వారసుడిగా వచ్చిన చంద్రబాబు మద్యం వ్యాపారులతో కుమ్మక్కై మద్యం వ్యాపారానికి తలుపులు బార్లా తెరిచారని చెప్పారు. మద్య నిషేధం సమయంలో లిక్కర్ అవసరమని అనుకూల పత్రికలలో వార్తలు రాయించిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. తెలుగుదేశం పాలనలో ఇంటింటికీ సీసా ఇచ్చి, ఎన్నికల సమయంలో పీకలదాకా తాగించి, తాగనోడు మనిషే కాదన్నట్లు మద్యం గురించి మాట్లాడారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు పదవిలోకి రాక ముందు గ్రామాల్లో ఎక్కడో దూరంగా సారా లభించేదని, ఆయన అధికారంలోకి వచ్చిన తరువాతే ఎక్కడ పడితే అక్కడ బెల్ట్ షాపులను పెట్టి మద్యం విక్రయించడం మొదలు పెట్టారని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు పాలనలోని 30 శాతం షాపులను తీసేయించిందని, 4380 షాపులుండగా వాటిని 2934 షాపులకు తగ్గించిందని తెలిపారు. ఒక సమయం ప్రకారం మద్యం విక్రయాలు జరపారని, ఇప్పుడు పగలు రాత్రి తేడా లేకుండా మద్యం విక్రయాలు చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ హయాంలో కనీసం ఒక్క డిస్టిలరీకి కూడా అనుమతి ఇవ్వలేదని, చంద్రబాబు తీసుకొచ్చిన బ్రాండ్లనే విక్రయించారని తెలిపారు. మద్యం దందా సాగించే సిండికేట్ల వ్యవస్థకు పూర్తిగా చెక్ పెట్టారని, మద్యం దుకాణాలకు అనుబంధంగా ఉన్న 43 వేల బెల్ట్ షాపులను, 4380 పర్మిట్ రూంలను రద్దు చేశారని వివరించారు. మద్యం విక్రయాలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే లంచాలు వస్తాయా, ప్రభుత్వం ద్వారా అమ్మితే లంచాలు వస్తాయో చెప్పాలన్నారు. రాజ్ కసిరెడ్డిని భయపెట్టి, లొంగదీసుకొని తప్పుడు కేసులు పెట్టేందుకు చంద్రబాబు ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతుందని ధ్వజమెత్తారు. కూటమి పాలనలో ఎమ్మెల్యేలకు షాపుల్లో వాటాలు ఇవ్వడం నిజం కాదా అని ప్రశ్నించిన ఆయన, ప్రస్తుతం క్వార్టర్ మీద రూ.10, ఫుల్ బాటిల్‌పై రూ.40 అధిక ధరలకు విక్రయిస్తున్నారని, ఇదంతా ఎవరి జేబులకు చేరుతుందని నిలదీశారు. ఎవరైనా రైతులకు గిట్టుబాటు ధర ఇస్తారని, విద్యార్థుల చదువులకు సహకరిస్తారని, నిరుపేదలకు వైద్యం అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటారని చంద్రబాబు మాత్రం మద్యం వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చడానికి ధరలను తగ్గిస్తానని చెప్పడం ఆయన వైఖరికి నిదర్శనమని విమర్శించారు. పాలనాపరంగా అన్నీ విధాలుగా విఫలమైన ఆయన ప్రజల దృష్టిని మరల్చడానికి మద్యం కేసుల కుట్రలకు తెరదీశారని, దీన్ని ప్రజలు కూడా హర్షించరని చెప్పారు. తెలుగుదేశం పార్టీ నాయకుడు వీరయ్య చౌదరి హత్య కేసులో ఊహాగానాలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. సమావేశంలో పార్టీ సంతనూతలపాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు పాలడుగు రాజీవ్ దేవా, నియోజకవర్గ విభాగం విద్యార్థి విభాగం అధ్యక్షుడు వేముల శ్రీకాంత్, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు పులుసు సురేష్, సయ్యద్ ఖాదర్, తన్నీరు సాయి కృష్ణ, షేక్ ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

భార్గవిని అభినందించిన కలెక్టర్

- 10వ తరగతిలో ప్రభుత్వ పాఠశాలలో 595 మార్కులు
- రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు, జిల్లాలో ప్రథమ ర్యాంకు



పుట్టా భార్గవిని సత్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ పదో తరగతి పరీక్షల్లో 595 మార్కులు సాధించిన పుట్టా భార్గవిని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా విద్యాశాఖాధికారులు భార్గవిని గురువారం కలెక్టర్ ఛాంబర్‌కు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ శాలువాతో భార్గవిని ప్రత్యేకంగా సన్మానించి అభినందనలు తెలిపారు. టంగుటూరు మండలం ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భార్గవి 10వ తరగతి చదివింది. భార్గవి రాష్ట్రంలో రెండో ర్యాంకు సాధించగా, జిల్లాలో ప్రథమ ర్యాంకు సాధించినందుకు అందరూ ప్రశంసించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా విద్యాశాఖాధికారి ఏ. కిరణ్ కుమార్‌ను ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుని, ఉపాధ్యాయుడు కాకా వెంకటేశ్వర రెడ్డి, ఉపాధ్యాయులు దామచర్ల శ్రీధర్, ముప్పా సురేష్, వెంకట్‌లను అభినందించారు. కార్యక్రమంలో ఒంగోలు ఉప విద్యాశాఖాదికారి ఏ.చంద్రమౌళి, టంగుటూరు ఎంఈఓ–2 తన్నీరు బాలాజీ ఉన్నారు.

నల్లబర్లీకి గిట్టుబాటు ధర కల్పించాలి

- మోసం చేస్తున్న కంపెనీలు
- పట్టించుకోకపోతే 'చలో ముఖ్యమంత్రి'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో నల్ల బర్లీ పొగాకు గిట్టుబాటు ధర కల్పించాలని.. క్వింటాకు రూ.15 వేల మద్దతు ధర ప్రకటించాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు డిమాండ్ చేశారు. గురువారం మల్లయ్య లింగం భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లబర్లీ పొగాకు రైతుల పట్ల వ్యాపారులు దుర్మార్గంగా ప్రవర్తిస్తూ దోపిడికి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. గత ఏడాది సరాసరిన రూ.15 వేలకు కొనుగోలు చేస్తే, ఈ ఏడాది కేవలం రూ.3 నుంచి రూ.4 వేలకు మాత్రమే కొంటున్నారని మండిపడ్డారు. ఇదేం న్యాయమని ప్రశ్నిస్తే రైతులు అధికంగా పొగాకు పండించారని, అంతర్జాతీయంగా బర్లీ పొగాకు డిమాండ్ లేదని మాయమాటలు చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక విస్తీర్ణంలో సాగు చేయమన్నది కార్పొరేట్ శక్తుల తొత్తులే కదా అని నిలదీశారు.

సాకులు చెప్తున్న కంపెనీలు..

నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ రాజమోహన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బర్లీ పొగాకు సాగు చేసింది అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ బడుగు బలహీన వర్గాలకు చెందిన కౌలు రైతులేనని తెలిపారు. గతేడాది వచ్చిన ధరలను చూసి ఎక్కువ భాగం పేద రైతులు వ్యవసాయంలోకి వచ్చారని, బంగారం తాకట్టు పెట్టి, అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి సాగు చేశారని చెప్పారు. నాడు ఏ కంపెనీ లైతే అధిక విస్తీర్ణంలో పంట పండించేందుకు ప్రోత్సహించారో ఇప్పుడదే కంపెనీలు అధిక విస్తీర్ణంలో పంట పండించారని సాకులు చెప్పడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. వీరారెడ్డి, ఉపాధ్యక్షులు హనుమంతరావు మాట్లాడుతూ.. ఈ నెల 26 నుంచి 30వ తేది వరకు జిల్లాలోని ఎమ్మెల్యేలకు, మంత్రులకు వినతి పత్రాలను ఇస్తామని, అప్పటికీ స్పందన లేకపోతే మే 5న చలో ముఖ్యమంత్రి కార్యక్రమానికి సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు నాయకులు వడ్డే హనుమారెడ్డి, పమిడి వెంకటరావు, భీమవరపు సుబ్బారావు, కోడూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి

బేస్తవారిపేట: మండలంలోని గలిజేరుగుళ్ల సమీపంలో ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి జరిగింది. చెన్నుపల్లె సమీపం నుంచి మట్టిని లోడు వెళ్తున్న ట్రాక్టర్ ఎదరుగా వెళ్తున్న మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న సీఎస్‌పురం మండలం పిల్లిపల్లెకు చెందిన చిన్నకొండు హటేలయ్య(24) అక్కడికక్కడే మృతిచెందాడు. చెన్నుపల్లెలోని బంధువు ఇంటికి వెళ్తున్న సమయంలో సంఘటన జరిగింది. హటేలయ్య మృతితో తండ్రి వెంకటపతి, కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

వీధి కుక్కలకు ఆపరేషన్లు చేయాల్సిందే

- ఒంగోలు నగరంలో పర్యటించిన ఆర్‌డీఎంఏ హరికృష్ణ



పార్కును పరిశీలిస్తున్న ఆర్‌డీఎంఏ హరికృష్ణ, ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలోని వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను విధిగా చేపట్టాలని రీజినల్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (ఆర్‌డీఎంఏ) హరికృష్ణ నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. గురువారం ఒంగోలు వచ్చిన సందర్భంగా నగరంలో ఆయన పర్యటించారు. స్థానిక కొత్తమామిడిపాలెంలో ఒంగోలు నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం ఏర్పాటు చేసిన షల్టర్, ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. జిల్లాలో మిగిలిన యూఎల్‌బీల నుంచి కూడా వీధి కుక్కలను ఆపరేషన్ల కోసం ఇక్కడికి తీసుకొస్తున్నారని ఆర్‌డీఎంఏ దృష్టికి నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు తీసుకెళ్లారు. వాటి కోసం ఇంకొన్ని బోనులను ఏర్పాటు చేసుకోవాలని ఆర్‌డీఎంఏ హరికృష్ణ ఆదేశించారు. ప్రస్తుతం రోజుకు 20 నుంచి 25 కుక్కలకు ఆపరేషన్లు చేస్తున్నారని కమిషనర్ తెలపగా, కుక్కలను పట్టుకోవడానికి ఉపయోగిస్తున్న వలలను ఆర్‌డీఎంఏ హరికృష్ణ పరిశీలించారు. అనంతరం అదే ఆవరణలోని వర్మీకంపోస్ట్ కేంద్రాన్ని పరిశీలించారు. దానిని వెంటనే వాడుకలో తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆవరణ ప్రాంగణంలోనే తడి చెత్తను కంపోస్ట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. ప్రాంగణంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ పార్కును సందర్శించారు. పార్కులో గ్రీనరీని చూసి ఇలాంటి పార్కులను నగరంలో కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య, వైష్ణవి, శానిటరీ సూపర్‌వైజర్ పిచ్చయ్య, సెంటర్ ఇన్‌చార్జి సూపర్‌వైజర్ బాబ్జి, కుక్కల ఆపరేషన్ డాక్టర్ సుధీర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మార్కెట్‌కి అనుగుణంగా బేళ్లను తీసుకురావాలి



వేలాన్ని పరిశీలిస్తున్న బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్

టంగుటూరు: మార్కెట్‌కు అనుగుణంగా పొగాకు రైతులు వేలానికి బేళ్లను తీసుకురావాలని బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్‌కుమార్ అన్నారు. స్థానిక వేలం కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేళ్లను తీసుకువచ్చేటప్పుడు తేమ, వేడి లాంటివి లేకుండా చూసుకోవాలన్నారు. లోగ్రేడ్ పొగాకు, నీళ్లు కట్టిన పొగాకు, మొద్దు పచ్చ రకం పొగాకు వేలానికి తీసుకురావద్దని సూచించారు. వ్యాపారులు నో బిడ్స్ లేకుండా మంచి ధరలతో కొనుగోలు చేసేలా బయ్యర్లతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, రీజినల్ మేనేజర్ లక్ష్మణరావు,వేలం నిర్వహణ అధికారి శ్రీనివాసరావు రైతులు పాల్గొన్నారు.

వడదెబ్బకు గుర్తు తెలియని వృద్ధుడు మృతి



వృద్ధుని మృతదేహం

మార్కాపురం: వడదెబ్బకు గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే..వివరాలు దరిమడుగు గ్రామం శివారులో ఒక సమాధి వద్ద సుమారు 70 ఏళ్ల వృద్ధుని మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించి సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి వెళ్లినట్లు ఎస్సై అంకమరావు తెలిపారు. ఆ వృద్ధుడు బుధవారం ఉదయం నుంచి అదే ప్రాంతాల్లో తిరిగినట్లు స్థానికులు తెలిపారని, ఒంటిపై షర్టు ప్యాంటు ఉందని, వడదెబ్బకు మృతి చెందినట్లుగా భావిస్తున్నట్లు తెలిపారు. స్థానికులు ఎవరైనా గుర్తిస్తే తమకు సమాచారం తెలపాలని ఎస్సై తెలిపారు.

35 వాహనాలు సీజ్



వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

కనిగిరిరూరల్: మైనర్ల డ్రైవింగ్‌పై గురువారం పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డీఎస్పీ పి.సాయిఈశ్వర్ యశ్వంత్ ఆధ్వర్యంలో మైనర్లు నడుపుతున్న 35 వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ మాట్లాడుతూ ప్రమాదాల నుంచి మైనర్లను కాపాడేందుకు ఈ డ్రైవ్ చేపట్టామన్నారు. సీజ్ చేసిన బైక్ డేటాను స్టేషన్‌లలో భద్రపరుస్తామన్నారు. మళ్లీ మైనర్స్ బైక్ డ్రైవింగ్‌లో దొరికితే ఈ సారి వారి తల్లిదండ్రులపైన కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మైనర్ల డ్రైవింగ్‌పై వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ ఎస్‌కే ఖాజావలి, ఎస్సై మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రుణాల రికవరీపై ప్రత్యేక దృష్టి సారించండి

- డీఆర్‌డీఏ పీడీ నారాయణ



మాట్లాడుతున్న పీడీ నారాయణ

మార్కాపురం టౌన్: ఎస్‌హెచ్‌జీ గ్రూపులు తీసుకున్న రుణాలను వెంటనే బ్యాంకులకు చెల్లించేలా చర్యలు చేపట్టాలని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఆర్‌డీఏ పీడీ నారాయణ అన్నారు. పట్టణంలోని డ్వాక్రా బజారులో గురువారం మార్కాపురం, యర్రగొండపాలెం క్లస్టర్ల పరిధిలోని సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఏఓలు మహిళల జీవనోపాధి, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలన్నారు. డీఆర్‌డీఏ ద్వారా అందిస్తున్న సేవలను, పథకాలను మహిళలకు వివరించాలన్నారు. స్త్రీనిధి, ఉన్నతి పథకాల ద్వారా తీసుకున్న రుణాలను చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. సెర్ఫ్ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు వివరాలను నమోదు చేస్తూ ఎస్‌హెచ్‌జీ గ్రూపులను యాక్టీవ్ చేయాలన్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి ఏజీఎం హర్షవర్ధన్, ఏరియా కో ఆర్డినేటర్ సుధాకర్, డీపీఎం సుబ్బారావు, మార్కాపురం, తర్లుపాడు, పొదిలి, కొనకనమిట్ల ఏపీఎంలు పిచ్చయ్య, రమేష్‌బాబు, గోపాల్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.